

అడవిలో కార్చిచ్చు
ఏర్పేడు సమీపంలోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు రేగింది. ఆదివారం గుర్తుతెలియని నిప్పు పెట్టినట్లు తెలిసింది.
- 8లో



కుప్పంలో ఉత్కంఠ
కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.
- 8లో



పంటపొలాలపై ఏనుగుల బీభత్సం
పాకాల మండలం గానుగపెంట పంచాయతీలో ఆదివారం ఏనుగులు పంటలను నాశనం చేశాయి.
- 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌తోపాటు పలువురు జిల్లా అధికారులు గ్రీవెన్స్‌లో అందుబాటులో ఉండనున్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత అధికారులు సూచించారు.

ఇండోనేషియా వర్సిటీతో ఎస్వీయూ ఒప్పందం



ఇండోనేషియా ప్రతినిధులతో సమావేశమైన ఎస్వీయూ అధికారులు

తిరుపతి సిటీ: ఇండోనేషియా బాండుంగ్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీతో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పలు అంశాలపై అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. బోధన, పరిశోధన రంగాల్లో రెండు విశ్వవిద్యాలయాల మధ్య పరస్పర సహకారం అంది పుచ్చుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం వర్సిటీలో ఇండోనేషియా యూనివర్సిటీ ప్రతినిధులు డాక్టర్ మిత్ర డి జమల్ బృందంతో ఎస్వీయూ వీసీ, రిజిస్ట్రార్, అధ్యాపకులు సమావేశమై పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో భాగంగా రిజిస్ట్రార్ భూపతి నాయుడు నేతృత్వంలో జూలైలో ఇండోనేషియాలో ఎస్వీయూ ప్రతినిధుల బృందం పర్యటించనుంది. మాజీ రెక్టార్ ప్రొఫెసర్ సీకే జయశంకర్, ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బీ.దేవప్రసాదరాజు, ఇంటర్నేషనల్ డీన్ ప్రొఫెసర్ ఎస్.కిషోర్ బృందం ఇండోనేషియాలో పర్యటించనుంది.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

తిరుపతి సిటీ: గత ఏడాది అటానమస్ హోదా పొందిన టీటీడీ కళాశాలల్లో సోమవారం నుంచి డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల, పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాళ్లు పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సుమారు మూడు వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఈ పరీక్షలు వచ్చే నెల 6వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

పలువురు సీఐల బదిలీ

తిరుపతి క్రైమ్ : జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం రేంజ్ డీఐజీ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గాజులమండ్యం సీఐ మురళీకృష్ణ, శ్రీకాళహస్తి టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు, రేణిగుంట సీఐ శరత్‌చంద్రను వీఆర్‌కు బదిలీ చేశారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి టూటౌన్‌కు నాగార్జున రెడ్డి, ఏర్పేడు సీఐ జయచంద్రను రేణిగుంట సీఐగా బదిలీ చేశారు. అలాగే డీఐజీ వీఆర్‌లో ఉన్న సీఐ మంజునాథను ఎస్పీ వీఆర్‌కు బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

అంపశయ్యపై ఆరోగ్యం!



పట్టించుకునేవారు లేక కుటుంబీకులే రోగిని ఆస్పత్రిలోకి తీసుకెళుతున్న దృశ్యం

అరకొరగా వైద్యసేవలు.. అందుబాటులో లేని మందులు.. వివిధ విభాగాల్లో వేధిస్తున్న సిబ్బంది కొరత.. రోగులకు సకాలంలో అందని చికిత్సలు.. ప్రజారోగ్య పరిరక్షణను పట్టించుకోని అధికారులు.. చివరకు పేదల ప్రాణాలను గాలికివదిలేసిన సర్కారు తీరుతో ప్రభుత్వాస్పత్రులు అంపశయ్యపై చేరుకున్నాయి. నాణ్యమైన సేవలు అందించడంలో విఫలమయ్యాయి. అపరిశుభ్ర వాతావరణంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యంతో దయనీయంగా తయారయ్యాయి. చివరకు ప్రభుత్వాస్పత్రికి రావాలంటేనే ప్రజలు భయపడే పరిస్థితులు దాపురించాయి.

ప్రజారోగ్య పరిరక్షణను గాలికొదిలేసిన ప్రభుత్వం

- ఏడు నెలలుగా వేధిస్తున్న మందుల కొరత
- పూర్తిగా పడకేసిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఖాళీ పోస్టుల భర్తీపై నిర్లక్ష్యం



తిరుపతి రుయాలో సెంట్రల్ ల్యాబ్

తిరుపతి తుడా : జిల్లాలో పెద్దాస్పత్రి రుయాతో పాటు పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గడచిన ఏడు నెలలుగా ఇదే పరిస్థితి జిల్లావ్యాప్తంగా ఉంది. అవసరాలకు తగ్గట్టు మందులు సరఫరా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చిన్న పాటి దగ్గు మందు సైతం ప్రభుత్వాస్పత్రుల్లో అందుబాటులో లేవంటే పరిస్థితి తీవ్రత అర్థం చేసుకోవచ్చు. సాధారణంగా ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా 713 రకాల మందులను ఆస్పత్రులకు సరఫరా చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కేవలం 320 రకాల మందులను మాత్రమే అందించి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పపేదల రోగులకు మందుల కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది. దీనికితోడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఇటీవల పీఎం జన ఔషధి ద్వారా ఓ ఏజెన్సీకి మందుల సరఫరా బాధ్యతలు అప్పగించారు. సదరు సంస్థకు పూర్తిస్థాయిలో మందులు అందించే సామర్థ్యం లేకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

ఖాళీగా పోస్టులు

జిల్లాలోని అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. ప్రధానంగా రుయాలో సిబ్బంది కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఎస్వీ మెడికల్ కళాశాల పరిధిలో రుయా, చిన్నపిల్లల ఆసుపత్రి, ప్రసూతి ఆసుపత్రులు నడుస్తున్నాయి. ఇందులో ప్రొఫెసర్లు 68మందికి గాను కేవలం 53మంది మాత్రమే ఉన్నాయి. 67మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు గాను, 59మంది మాత్రమే అందుబాటులో ఉన్నారు. 223మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు గాను 185మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే వంద మందికి పైగా నర్సుల అవసరముంది. రుయాలో హెడ్ నర్సు, స్టాఫ్ నర్సులు 517మందికి గాను ప్రస్తుతం కేవలం 382మంది మాత్రమే పనిచేస్తున్నారు. 135 నర్సింగ్ పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాల్సి ఉంది. అలానే రోగుల సహాయార్థం పనిచేయాల్సిన ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓల కొరత తీవ్రంగా ఉంది. మరో 120 మందిని తీసుకోవాలని ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి స్పందన కరువైంది.

నాడు సక్రమంగా సేవలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్యరంగాన్ని బలోపేతం చేసింది. కార్పొరేట్ ఆస్పత్రులతో సమానంగా గ్రామీణ వైద్య కేంద్రాలను సైతం పటిష్టం చేసింది. పూర్తిస్థాయిలో మందులు, వైద్యులను, సిబ్బందిని అందుబాటులో ఉంచింది. మందుల కొరత అన్నమాటే తలెత్తకుండా చర్యలు చేపట్టింది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ఇంటింటికీ వైద్యసేవలను అందించింది. ఈ క్రమంలోనే 3వేల వ్యాధులను ఆరోగ్య శ్రీలో చేర్చి రూ.25లక్షల వరకు ఖర్చును ప్రభుత్వమే భరించేలా విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగ సంస్థలను నిర్వీర్యం చేసేలా కూటమి సర్కారు వ్యవహరిస్తోంది. కార్పొరేట్ హాస్పిటళ్లకు కొమ్ముకాసేలా కుట్రపూరితంగా నిర్ణయాలు తీసుకుంటోంది.



వైద్యం కోసం రుయాలో బారులు తీరిన రోగులు

అధ్వాన్నంగా పారిశుద్ధ్యం



పమాదకరంగా బయోమెడికల్ వేస్ట్

తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రులతోపాటు జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాలలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. ఎక్కడికక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. బయో మెడికల్ వేస్ట్ ప్రమాదకరంగా డంపింగ్ చేశారు. కార్మికుల చేత మాన్యువల్‌గానే పనులు చేస్తున్నారు. బ్లీచింగ్ చల్లడమే వదిలేశారు. కలెక్టర్ సైతం ఇటీవల ఆస్పత్రుల్లో పారిశుద్ధ్య లోపంపై కన్నెర్ర చేశారు.

జిల్లా సమాచారం

జిల్లా ఆస్పత్రి	రుయా
రోజువారీ ఓపీలు	సుమారు 1,200
ఏరియా వైద్యశాలలు	2
ఓపీలు	సుమారు 200
అర్బన్ హెల్త్ సెంటర్లు	26
ఓపీలు	సుమారు 90
గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు	60
ఓపీలు	సుమారు 150
మందుల సరఫరా చేయాల్సిన సంస్థ	ఏపీఎంఎస్ఐడీసీ
అందించాల్సిన మందుల రకాలు	713
ప్రస్తుతం సరఫరా చేస్తున్నవి	320

SAKSHI గ్రౌండ్ రిపోర్ట్ GROUND REPORT



వీల్‌చైర్ లేకపోవడంతో రోగిని చేతులతో ఎత్తుకుని వెళుతున్న సహాయకులు

రోగులపై భారం





ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలు లేకపోవడంతో రోగులను కుటుంబసభ్యులే తీసుకెళ్తున్న దృశ్యం

ప్రభుత్వాస్పత్రుల్లో కనీసం బీపీ, షుగర్‌తోపాటు దగ్గు మందులు కూడా లేకపోవడంతో రోగులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారు. చివరకు బీ కాంప్లెక్స్ మాత్రలు కూడా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలికంగా మందులను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కలెక్టర్ ఓ అడుగు ముందుకేసి డిస్ట్రిక్ పర్చేజింగ్ కమిటీని ఏర్పాటు చేసినా పెద్దగా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నాట. . రోగులకు అత్యవసరమైన మందులు అందుబాటులో లేకపోవడంతో వైద్యులు రాయించే స్లిప్‌లతో ప్రైవేటు మెడికల్ షాపులను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలోనే ల్యాబ్‌లో సైతం అరకొరగానే పరీక్షలు చేస్తున్నారు. ఆయా టెస్టులకు కావాల్సిన మందులు, సామగ్రి అందుబాటులో లేక సిబ్బంది చేతులెత్తేస్తున్నారు. పట్టణ, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. రక్త, మూత్ర పరీక్షలకు అవసరమైన కెమికల్స్ సైతం లేని దయనీయ పరిస్థితి..

తరిమేస్తున్నారు



ఇంత పెద్ద రుయా ఆస్పత్రిలో థైరాయిడ్ పరీక్ష చేయలేమంటున్నారు. పదిరోజుల తర్వాత రమ్మని తరిమేస్తున్నారు. తిరుచానూరు నుంచి ఆటోలో రానుపోనూ రూ.300 ఖర్చు చేయాల్సి వచ్చింది. థైరాయిడ్ పరీక్షకోసం పరగడుపున ఇంత దూరం వస్తే తీరా టెస్ట్ చేయకుండానే వెనక్కి పంపేశారు. మా అమ్మకు కాళ్లు వాచాయని వస్తే 5రకాల మందులు రాశారు. ఇందులో రెండు రకాలు బయట తీసుకోవాలని ఉచిత సలహా కూడా ఇచ్చారు.
– పి.రేఖ, తిరుచానూరు

బయట తీసుకోమంటున్నారు



మా అమ్మ పెరాలసిస్‌తో బాధపడుతోంది. గత ఏడాది నుంచి రుయాలోనే చూపించుకుంటున్నాం. వైద్యులు పరీక్షించి మందులు రాశారు. ఐదురకాల మందులు రాస్తే కేవలం రెండు రకాలు ఇచ్చి మరో రెండు బయట ప్రైవేటు షాపులో కొనుక్కోమన్నారు. అలానే నరాల వ్యాధికి మందులు కూడా లేవన్నారు. పేదవాళ్ల అంత డబ్బు పెట్టి మందులు ఎలా కొనుక్కోవాలో అర్థం కావడంలేదు.
– చెంచయ్య, రోగి కుమారుడు

దారుణంగా ఉంది



రుయా ల్యాబ్‌లో ఎక్స్‌రే, ఎమ్ఆర్ఐ స్కానింగ్, రక్త పరీక్షల రిపోర్టులు సకాలంలో అందించడం లేదు. నా భర్తకు గుండెకు సంబంధించి ఎక్స్‌రే తీయించాం. త్వరగా ఇవ్వండి సారూ...అంటూ బ్రతిమలాడినా పట్టించుకోవడం లేదు. డాక్టర్లు రిపోర్టులు వచ్చాకా తీసుకుని రండి అంటున్నారు. అన్నమయ్య జిల్లా నుంచి వచ్చాం. రిపోర్టులు వచ్చేందుకు ఇంకా రెండు రోజులు పట్టేటట్లు ఉంది. ఊరికి వెళ్లి మళ్లీ రావాల్సిందే. వ్యయప్రయాసలు తప్పడం లేదు.
– సుబ్బమ్మ, రోగి భార్య

నాడు అభివృద్ధి.. నేడు ఆర్భాటం!

దక్షిణ కైలాసంగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి ప్రతిష్టను ఇనుమడింపజేసేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. ముక్కంటి ఆలయాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ అమలు చేసింది. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో భక్తులకు అద్భుతంగా వసతులను అందుబాటులోకి తీసుకువచ్చింది. అయితే కూటమి సర్కారు మాత్రం గతంలో చేసిన పనులను సైతం నిస్సిగ్గుగా తన ఖాతాలో వేసుకుంటోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేవలం ఒక్క ఆర్చిని నిర్మించి అంతా చేసేశామంటూ డప్పు కొట్టుకుంటోంది.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ముక్కంటి ఆలయాభివృద్ధికి శ్రీకారం
- అద్భుతంగా గిరి ప్రదక్షిణ రహదారి నిర్మాణం
- ప్రణాళికాబద్ధంగా కరకట్ట సుందరీకరణకు చర్యలు
- మొత్తం తమ ఘనతే అని డప్పు కొట్టుకుంటున్న పచ్చనేతలు

శ్రీకాళహస్తి : ముక్కంటి ఆలయం, అనుబంధ ఆలయాలను కేవలం ఐదేళ్లలోనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసింది. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేని స్థాయిలో అనేక పనులను పూర్తి చేసింది. అయితే కూటమి నేతలు మాత్రం గత సర్కారు చేపట్టిన పనులను సైతం తామే చేసినట్టు చెప్పుకోవడం పట్టణవాసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



గిరి ప్రదక్షిణ రోడ్డు

లీకేజీ సమస్యకు పరిష్కారం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఎన్నో ఏళ్లగా లీకేజీ సమస్య ఇబ్బందికరంగా ఉండేది. వర్షం పడితే ఆలయం మొత్తం ఉరిసేది. దీంతో ఆలయం ఎక్కడ దెబ్బతింటుందో అని భక్తులు ఆందోళన చెందేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎంపీ గురుమూర్తి చొరవతో ముంబాయికి చెందిన వెంకోబ్ చికెన్ సంస్థను సంప్రదించి ఆలయ మరమ్మతుకు అయ్యే ఖర్చు రూ.5కోట్లను భరించేలా ఒప్పించారు. ఈ నేపథ్యంలో అనేక పురాతన ఆలయాలను అధ్యాయనం చేసి లీకేజీని అరికట్టడానికి ఆలయంపై మరమ్మతులు చేపట్టారు. ఇందులో ఎంపీ గురుమూర్తి, అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు కీలక పాత్ర పోషించారు. మొత్తం పనులు పూర్తి అయిన తర్వాత టీడీపీ నేతలు మాత్రం తామే ఆలయ లీకేజీలను అరికట్టేశామని సోషల్ మీడియాలో ప్రచారం చేసకోవడం విడ్డూరం.

కరకట్ట సుందరీకరణకు బీజం

స్వర్ణముఖి నది ఉత్తరం వైపున కరకట్ట ముళ్లకంపలు, చెట్లతో చిట్టడవిని తలపించేది. స్వర్ణముఖి నది ప్రక్షాళనలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.5కోట్లతో కరకట్ట వద్ద పటిష్టమైన గోడ, రోడ్డు నిర్మించారు. ఇందులోనే రూ.2కోట్ల వ్యయంతో శ్రీ-కాళ-హస్తి ప్రతిమలను పోలిన పార్కును అభివృద్ధి చేయాలని సంకల్పించారు. అందుకు సంబంధిచిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అనుమతులు పొందారు. అయితే ఎన్నికల కోడ్ రావడంతో ఆగిన ప్రక్రియ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది గడుస్తున్నా కేవలం ఆర్చి మాత్రమే నిర్మించారు. అయితే మొత్తం అన్నీ మేమే చేశాం అంటూ సోషల్ మీడియా, పచ్చ పత్రికల్లో ప్రచారం చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో శ్రీకాళహస్తి ప్రజలకు ఇవన్నీ ఎవరు చేశారనేది అవగతమే.

గిరి ప్రదక్షిణ రహదారి

కైలాసగిరుల్లో స్వామి అమ్మవార్ల ప్రదక్షిణకు వెళ్లాలంటే భక్తులు నానా ఇబ్బందులు పడేవారు. దారి మొత్తం కొండలు, గుట్టలు, ముళ్లతో ఉండేది. ఏటా రెండు సార్లు నిర్వహించే గిరిప్రదక్షిణను టీడీపీ నేతలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గిరి ప్రదక్షిణ మార్గంలో 21 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించేందుకు ప్రణాళిక రూపొందించారు. తొలి విడతగా 11కిలోమీటర్ల మేర రూ.18.80 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అలాగే వేయిలింగాల కోన వద్ద నుంచి తుపాను సెంటర్ వరకు రోడ్డును శుభ్రం చేసి నిర్మాణానికి సిద్ధం చేశారు. ఈ గిరిప్రదక్షిణ రోడ్డులో స్వామి అమ్మవార్లు విడిది చేయాలంటే గతంలో షామియానాలే దిక్కుగా ఉండేది. అలాంటి చోట్ల 8 మండపాలను సుమారు రూ.1.20కోట్లతో నిర్మించారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం కేవలం 7 కిలోమీటర్ల రోడ్డును రూ.7కోట్లతో నిర్మించాలని నిర్ణయించినా.. ఇప్పటికీ టెండర్లు కూడా పూర్తికాని పరిస్థితి. ఇప్పుడు మళ్లీ మరో రూ.2కోట్లు అంచనా వ్యయం పెంచి టెండర్లు కట్టబెట్టేందుకు యత్నిస్తున్నట్లు సమాచారం. మొత్తం కొండ చుట్టు రోడ్డును తామే నిర్మించినట్లు ప్రచారం చేసుకోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




వైఎస్సార్‌సీపీ హయంలో నిర్మించిన విడిది మండపం

శివం టు శివం రోడ్డు



శివం టూ శివం రోడ్డు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే తదితరులు (ఫైల్)

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ముక్కంటి ఆలయానికి వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా అన్న క్యాంటీన్ నుంచి అర్ధనారీశ్వరస్వామి గుడి వరకు 2.75 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గోపాలవనం, జాంద్రపేట, బహదూరుపేట, సాలిపేట, తెట్టు ప్రాంతాల లింకురోడ్లను కలుపుతూ రూ.29కోట్లతో శివం టు శివం రోడ్డు పేరిట పనులకు టెండర్లు పిలిచి శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. అయితే నూతన కూటమి ప్రభుత్వం మాత్రం ఈ రోడ్డు పనులను తమ అనుచరులకు కట్టబెట్టేందుకు పాత టెండర్లను రద్దు చేసింది. సుమారు 4శాతం అంచనా వ్యయం పెంచి పచ్చ నేతలకు టెండర్లు అప్పగిస్తోంది. అయితే శివం టు శివం రోడ్డు ప్లాన్ తమదే అంటూ ఎల్లోమీడియాలో ప్రచారం చేసుకుంటోంది.



దుర్గమ్మ తిప్ప వద్ద ప్రారంభమైన రోడ్డు పనులు

శివయ్యా.. ఈ కష్టాలు ఏమిటయ్యా..!



ఆలయంలో పోటెత్తిన భక్తులు

శ్రీకాళహస్తి: వాయులింగేశ్వరాలయంలో దర్శనానికి వచ్చే భక్తుల కష్టాలకు అంతులేకుండా పోతోంది. ఆదివారం అమావాస్య కావడంతోపాటు రాహుకేతు పూజల కోసం భక్తులు పోటెత్తారు. రికార్డు స్థాయిలో 30 వేల మందికి పైగా దర్శించుకున్నట్టు అధికారుల లెక్కలను బట్టి తెలుస్తోంది. ఈ క్రమంలో అధికారులు సరైన ప్రణాళికలు అమలుచేయకపోవడంతో రాహుకేతు పూజలతోపాటు స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. రూ.500, రూ.750 రాహుకేతు పూజ టికెట్లు తీసుకునే భక్తులు పూజ, దర్శనం పూర్తయ్యే సరికి నాలుగైదు గంటలు పట్టింది. రూ.200 టికెట్లు తీసుకున్న వారి పరిస్థితి కూడా అంతే. దీంతో మధుమేహ బాధితులు, వృద్ధులు, పిల్లలు అసహనానికి లోనై ఆలయ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే భక్తులు తమ చెప్పులను భిక్షాల గోపురం, శివయ్య గోపురం వద్ద వదలండంతో దక్షిణ గోపురం నుంచి దర్శనం చేసుకుని బయటకు వచ్చి అక్కడి వరకు ఎండలో కాళ్లు కాలుతూ నడవాల్సి వచ్చింది.

రికార్డు స్థాయిలో పూజలు

ఆదివారం రికార్డు స్థాయిలో 8,766 రాహు కేతు పూజలు జరిగాయి. అంతేకాకుండా రూ.200 శీఘ్ర దర్శనానికి 4,109 టికెట్లు, రూ.500 అంతరాలయ దర్శనం టికెట్లు 564 అమ్ముడుపోయినట్టు అధికారులు వెల్లడించారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 31 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 82,811 మంది స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.24 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు మాత్రం 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

జిల్లాలో కార్డన్ సెర్చ్
– పలు వాహనాలు సీజ్



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి జిల్లాలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో శనివారం అర్ధరాత్రి అనంతరం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తనిఖీలు చేసిన 90 వాహనాల్లో 22 వాటికి సరైన రికార్డులు లేనివిగా గుర్తించి సీజ్ చేశారు. రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచారు. గూడూరు, శ్రీకాళహస్తి, పుత్తూరు సబ్ డివిజన్‌లో రెండు వాహనాలకు సరైన రికార్డులు లేనట్లుగా గుర్తించారు. పుత్తూరు, రేణిగుంట సబ్ డివిజన్లలో ఈ కార్యక్రమం నిర్వహించారు.న్ని సక్రమంగా ఉన్నాయని తెలిపారు. అలాగే, రేణిగుంట సబ్ డివిజన్‌లో తొమ్మిది వాహనాలను సీజ్ చేశారు.

జలపాతంలో యువకుడి గల్లంతు

నాగలాపురం: మండలంలోని భూపతీశ్వర కోన జలపాతంలో ఆదివారం చెన్నైకి చెందిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఎస్‌ఐ సునీల్ కథనం మేరకు.. తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన నలుగురు యువకులు భూపతీశ్వర కోనకు వచ్చారు. జలపాతంలో స్నానం చేస్తుండగా సచిన్ (22) అనే యువకుడు మునిగిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీశారు. సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాపు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు


అడవిలో కార్చిచ్చు



ఏర్పేడు అటవీ ప్రాంతంలో వ్యాపిస్తున్న మంటలు

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడులో సమీపంలోని అటవీ ప్రాంతంలో కార్చిచ్చు రేగింది. ఆదివారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు కొండంతా వ్యాపిస్తున్నాయి. దీనిపై సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది హుటాహుటిన చేరుకుని మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. అయితే గాలులు బలంగా వీస్తుండడంతో మంటలు వేగంగా వ్యాప్తి చెందుతున్నాయి. కార్చిచ్చు వ్యాసాశ్రమ గోడల వరకు రావటంతో ఆశ్రమంలోని వారు ఆందోళన చెందారు.

కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది. సాక్షాత్తు సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కావడంతో అందరి దృష్టి కుప్పంపైనే ఉంది. పట్టు నిలుపుకునేందుకు వైఎస్సార్ సీపీ.. బలం లేకపోయినా పురపీఠం దక్కించుకునేందుకు టీడీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా ప్రలోభాలు..బెదిరింపులు..కుట్రలు..కుతంత్రాలకు తెరతీసింది.



కుప్పం వ్యూ

కుప్పంలో ఉత్కంఠ

ఎత్తులు.. జిత్తులు
- నేడు కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నిక
- ప్రజాస్వామ్యంపై నమ్మకంతో బరిలో దిగిన వైఎస్సార్ సీపీ
- అధికార బలంతో కూటమి సన్నద్ధం

కుప్పం రూరల్ : కుప్పం మున్సిపాలిటీ చైర్మన్ ఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం నిర్వహించనుంది. రిటర్నింగ్ అధికారిగా ఆర్డీఓ శ్రీనివాసరాజు, అబ్జర్వర్‌గా జేసీ విద్యాధరిని నియమించింది. నేటితో పురపీఠం ఎవరిదనే ఉత్కంఠకు తెరపడనుంది.

ఎన్నిక ఇలా..

మున్సిపల్ చైర్మన్ సుధీర్ తన పదవికి రాజీనామా చేయడంతో ఎన్నికలు అనివార్యమయ్యాయి. కుప్పంలో మొత్తం 25 మంది కౌన్సిలర్లు ఉన్నారు. సుధీర్ కౌన్సిలర్ పదవికి సైతం రాజీనామా చేయడంతో ప్రస్తుతం 26 మంది మాత్రమే కౌన్సిలర్లుగా ఉన్నారు. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు, ఎమ్మెల్సీలు కంచెర్ల శ్రీకాంత్, భరత్‌కు మున్సిపల్ కౌన్సిల్‌లో ఓటు హక్కు ఉంది.. దీంతో సభ్యుల సంఖ్య 27కు చేరింది. ఇందులో చంద్రబాబు వచ్చే అవకాశాలు లేకపోవడంతో 26 మంది సభ్యులతోనే ఎన్నిక జరిగే అవకాశాలు ఉన్నాయి. 14 మంది అభ్యర్థులు ఎవరికి చేతులు ఎత్తి మద్దతు తెలిపితే వారే చైర్మన్ అవుతారు. ఈ ఎన్నిక ప్రక్రియకు అధికారులు కుప్పం ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌ను సిద్ధం చేశారు.

సమాయత్తమైన ఇరు పార్టీలు

2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 19, టీడీపీ 6 గెలుచుకున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరిపోయారు.ప్రస్తుతం గెలవాలంటే మరో నలుగురు అభ్యర్థుల అవసరం ఉంది. బలం కోసం వైఎస్సార్ సీపీ అభ్యర్థులను టీడీపీ ప్రలోభపెడుతోంది.

వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థిగా హఫీజ్

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా 9వ వార్డు కౌన్సిలర్ ఎస్‌డీ హఫీజ్ బరిలో దిగారు. ప్రత్యామ్నాయంగా 2వ వార్డు కౌన్సిలర్ ఆర్. మునిరాజును పార్టీ అధిష్టానం ఎంపిక చేసింది. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి రంగంలోకి దిగారు. కౌన్సిలర్లకు విప్ జారీ చేసే బాధ్యతను కౌన్సిలర్ ఆర్. మునిరాజుకు కట్టబెట్టారు.

పదవి కోసం కుమ్ములాటలు!

ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నట్టు తయారైంది కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో టీడీపీ పరిస్థితి. వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ బలం ఉండడంతో ఆ పార్టీకి విజయావకాశాలు నల్లేరుపై నడకేనని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే బలం లేకపోయినా.. బరితెగించి కుప్పం చైర్మన్ గిరిని తన్నుకుపోవాలని టీడీపీ పన్నాగాలు పన్నుతోంది. ఈ క్రమంలోనే 19, 20, 5 వార్డుల కౌన్సిలర్లు దామోదరం, సోమశేఖర్, సెల్వరాజు చైర్మన్ కుర్చీ కోసం పోటీపడుతున్నట్టు తెలుస్తోంది. శనివారం రాత్రి హొసూరు సమీపంలోని క్యాంప్‌లో టీడీపీ నేతల మధ్య వివాదం రేగి, కుమ్ములాటలకు దారితీసినట్టు సమాచారం.

30న పాలిసెట్.. సర్వం సిద్ధం

- ఉదయం 11 నుంచి ఒంటి వరకు పరీక్ష
- కఠినంగా నిముషం నిబంధన అమలు

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో అడ్మిషన్ కోసం పాలిసెట్‌ను ఈ నెల 30వ తేదీ బుధవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నారు. ఆదివారం ఈ మేరకు పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ . తిరుపతిలో 8, గూడూరులో 5, సత్యవేడులో 2, మొత్తం 15పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 5,288 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ఉదయం 9.30గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకోవాలని, 10 గంటల నుంచి లోపలికి అనుమతిస్తామని వివరించారు. 11గంటల నుంచి పరీక్ష ప్రారంభమవుతుందని, ఒక్క నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమతించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. బ్యాగులు, పర్సులతోపాటు, మొబైల్ ఫోన్లు, క్యాలికులేటర్ వంటి ఎల్రక్టానిక్ పరికరాలకు అనుమతి లేదని తెలిపారు. విద్యార్థులు తప్పనిసరిగా ఒరిజినల్ హాల్ టికెట్, ఆధార్ కార్డు లేదా, ఏదేని ఫొటో కలిగిన గుర్తింపు కార్డు, బాల్ పాయింట్ పెన్ను, హెచ్‌బీ పెన్సిళ్లు, ఎరేజర్, షార్పనర్‌ను తెచ్చుకోవాలని సూచించారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..
- **తిరుపతి** : కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ , ఎస్‌జీఎస్ ఉన్నత పాఠశాల, బాలాజీ కాలనీలోని శ్రీపద్మావతి బాలికల హైస్కూల్, శ్రీపద్మావతి మహిళా జూనియర్ కళాశాల బ్లాక్ ఏ అండ్ బ్లాక్ బీ, శ్రీపద్మావతి మహిళా పాలిటెక్నిక్ , శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాల బ్లాక్ ఏ అండ్ బ్లాక్ బీ.
- **గూడూరు** : తిలక్‌నగర్, సెరామిక్ ఫ్యాక్టరీ రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్, ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, డీఎస్పీ కార్యాలయం సమీపంలోని డీఆర్‌డబ్ల్యూ కళాశాల, బాలుర జెడ్పీ హైస్కూల్, బాలికల జెడ్పీపీ హైస్కూల్.
- **సత్యవేడు** : బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సమీపంలోని ఏపీఎస్‌డబ్ల్యూ బాలికల జూనియర్ కళాశాల, ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి



గాయపడిన ఉదయ్

పాకాల:మండలంలోని కంబాలమిట్టలో ఆదివారం జల్లికట్టు నిర్వహించారు. ఇదే అదునుగా టీడీపీ నేతలు రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడి చేశారు. సుమారు 20 జతల ఎద్దులకు పలకలు కట్టి తీసుకెళ్లడం జీర్ణించుకోలేని పచ్చమూక చెలరేగిపోయారు. అమ్మగారిపల్లెకు చెందిన ఉదయ్, జనార్దన్‌ను చితకబాదారు. జనార్దన్ వ్యాన్‌ను సైతం ధ్వంసం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నేతలు అక్కడకు చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు.

ఇంటి దొంగ అరెస్ట్

తిరుపతి క్రైమ్ : పనిచేసే షాపులోనే యాజమానికి తెలియకుండా చోరీకి పాల్పడిన ఓ ఇంటి దొంగను అరెస్ట్ చేసినట్లు క్రైమ్ పోలీసులు ఆదివారం రాత్రి తెలిపారు. వివరాలు.. తిరుపతిలోని పార్లవీధిలో ఉన్న ఎస్‌జే నగల దుకాణంలో రామచంద్రపురానికి చెందిన మేఘవర్మ అలియాస్ బన్నీ(20) కొంతకాలంగా పనిచేస్తున్నాడు. షాప్ యజమాని ఇంట్లో పెళ్లి ఉండడంతో మూడు నెలలుగా ఆ పనుల్లో బిజీగా ఉన్నాడు. ఇదే అదునుగా భావించిన మేఘవర్మ షాపులో 258 గ్రాముల బంగారం, 360 గ్రాములు వెండిని విడతల వారీగా అపహరించాడు. పెళ్లి పనులన్నీ అయిన వచ్చిన దుకాణానికి వచ్చిన యజమాని అకౌంట్లు చెక్ చేయగా విషయం బయటపడింది. ఆయన ఫిర్యాదు మేరకు క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. 271 గ్రాముల బంగారం, 356 గ్రాముల వెండిని స్వాధీనం చేసుకున్నారు.

తిరుమల ఘాట్‌లో కారు బోల్తా

తిరుమల : తిరుమల మొదటి ఘాట్‌లో ఆదివారం సాయంత్రం ఓ కారు బోల్తా పడింది. వివరాలు.. విజయనగరానికి చెందిన భక్తులు శ్రీవారిని దర్శించుకుని తిరుపతికి టాటా సుమో వాహనంలో వస్తుండగా వినాయక స్వామి ఆలయం సమీపంలో అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న ఘాట్‌రోడ్డు భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. తిరుమల ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

30 స్టార్టర్ల చోరీ



స్టార్టర్లు అపహరించడంతో ఖాళీగా బాక్సు

శ్రీకాళహస్తి రూరల్/రేణిగుంట : శ్రీకాళహస్తి మండలంలోని అమ్మపాళెం, పుల్లారెడ్డి కండ్రిగలో శనివారం రాత్రి పలువురు రైతులకు చెందిన పొలాల్లో సుమారు 30 స్టార్టర్లను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. పది రోజుల క్రితం ఇదేవిధంగా 20 స్టార్టర్లను చోరీ చేసినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక స్టార్టర్ సెట్ రూ.7వేలు అవుతుందని వివరించారు. పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దొంగలను పట్టుకోవాలని కోరుతున్నారు. అయితే స్టార్టర్ల చోరీపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

తప్పిపోయిన బాలుడి గుర్తింపు



బాలుడితో పోలీసులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుమలలో తప్పిపోయిన బాలుడిని రేణిగుంట మండలం మల్లవరంలో పోలీసులు గుర్తించారు. ఎస్ ఐ అరుణ్ కుమార్ రెడ్డి కథనం మేరకు .. తిరుమలలో కర్ణాటక రాయచూర్ జిల్లా ముద్గల్ గ్రామానికి చెందిన కృష్ణప్ప కుమారుడు శ్రీనివాస్ (16) తప్పిపోయినట్లు తిరుమల టూటౌన్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ మేరకు బాలుడిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టామని ఎస్ఐ తెలిపారు.

పంట పొలాలపై ఏనుగుల బీభత్సం

పాకాల: మండలంలోని గానుగపెంట పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. ఆదివారం చినపాపయ్యగారిపల్లి గ్రామానికి చెందిన రైతు టీ.గురుదేవ్‌కి సంబంధించిన రెండు ఎకరాల వరి పంటను తొక్కి నాశనం చేశాయి. అలాగే పొలం చుట్టూ వేసిన కంచెను ధ్వంసం చేశాయి. రైతుకు సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లింది. పక్కనే మరో రైతు సోమశేఖర్‌కు చెందిన అర ఎకరా వరి పంట, చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను నాశనం చేశాయి. రైతుకు రూ.40 వేల వరకు నష్టం చేకూరింది. ధనూజవారిపల్లి గ్రామానికి చెందిన రైతు కే.సురేంద్రరెడ్డి మామిడి తోట, ఫెన్సింగ్‌ను సర్వనాశనం చేయగా.. రూ.50 వేల వరకు నష్టం వాటిల్లింది. ఫారెస్ట్ అధికారులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

'పోటు' సహకార సంఘానికి ఎన్నికల



ఓట్ల లెక్కింపు నిర్వహిస్తున్న ఎన్నికల సిబ్బంది, పరిశీలిస్తున్న అభ్యర్థులు

తిరుమల : శ్రీ వేంకటేశ్వర పోటు వర్కర్స్ సహకార సొసైటీ తిరుమల పాలకవర్గానికి ఆదివారం ఎన్నిక నిర్వహించారు. స్థానిక ఎస్వీ ఉన్నత పాఠశాలలో ఏడుగురు సభ్యుల కోసం నిర్వహించిన ఎన్నికలో 22 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. 471 మందికి గాను 393 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సొసైటీ మేనేజింగ్ కమిటీ సభ్యులుగా ఎస్. సునీల్ కుమార్, జె.దివాకర్, పీవీ రామ్‌కుమార్, ఎస్.బాలాజీ, డి.శంకర్, పూజారి రఘు, నీటి వంశీకృష్ణ గెలుపొందినట్లు ఎన్నికల అధికారి వి.సురేష్ బాబు ప్రకటించారు.

వేద విజ్ఞానం.. విశ్వవ్యాప్తమే లక్ష్యం

- యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులకు అడ్మిషన్లు ప్రారంభం
- ఎస్వీ వేదిక్ వర్సిటీ రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ భాస్కరుడు

తిరుపతి సిటీ : ఎస్వీ వేదిక్ యూనివర్సిటీ పరిపూర్ణ వేద విజ్ఞానానికి నిలయమని, వేదాల సారాంశాన్ని విశ్వవ్యాప్తం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తోందని రిజిస్ట్రార్ పోకల భాస్కరుడు తెలిపారు. దేశంలో వేద విద్యను సంపూర్ణంగా అందిస్తున్న ఏకైక విశ్వవిద్యాలయం ఎస్వీ వేదిక్ వర్సిటీ అని వెల్లడించారు. 2025–26 అకడమిక్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో వర్సిటీలోని కోర్సుల వివరాలు, అర్హతలు, ఉపాధి అవకాశాలపై ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన మాటలలోనే...

- వర్సిటీలో ప్రధానంగా 19 విభాగాలలో అడ్మిషన్లు చేపడుతున్నాం.
- యూజీకోర్సులకు సంబంధించి నూతన విద్యా విధానం అమలు చేస్తున్నాం.
- వేద విభాగంలో రుగ్వేద, కృష్ణ యజుర్వేద, శుక్ల యజుర్వేద, సామవేద, అధర్వణ వేదం, ఆగమ శాస్త్రం విభాగంలో వైఖానస ఆగమం, పంచరత్ర గామం, శైవాగమంలోనూ, పౌరోహిత్యం విభాగంలో అశ్వాలయన, అపస్తంభ, పరస్కర, వైఖానస పౌరోత్యంలోనూ, వేదభాష్యంలోని 5 విభాగాలలో, కల్ప, మీమాంస విభాగాలలో 15 సీట్లు చొప్పున అడ్మిషన్లు చేపడుతున్నాం.
- పీజీ(ఆచార్య) కోర్సులకు సంబంధించి ఒక్కో విభాగానికి 10 సీట్లు భర్తీ చేయనున్నాం. అలాగే ఏదైనా డిగ్రీతోపాటు సంస్కృతంపై పట్టు ఉండేవారి కోసం డిప్లొమా కోర్సులను ప్రవేశపెట్టాం.
- ఇంటర్ పూర్తి చేసి సంస్కృతం పరిజ్ఞానం ఉన్న వారికోసం ఏడు విభాగాలలో సర్టిఫికెట్ కోర్సును సైతం అందిస్తున్నాం.
- దరఖాస్తుకు జూన్ 10వ తేదీని చివరి గడువుగా నిర్ణయించాం. వివరాలకు 0877–2222587, 9701001777 నంబర్లలో సంప్రదించాలి.
- వేదిక్ వర్సిటీలో పరిశోధనలకు పెద్దపీట వేస్తున్నాం.
- వేద జ్ఞానాన్ని ప్రపంచానికి అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాం.
- ప్రాచీన తాళపత్రాలను డిజిటలైజేషన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.
- వేదిక్ నాలెడ్జ్‌ను అందించేందుకు ఐఐటీ, ఐఐఎం, ఐజర్‌తో పలు అంశాలపై కలసి పనిచేస్తున్నాం.
- వేదిక్ వర్సిటీలో యూజీ, పీజీ, పీహెచ్‌డీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు వందశాతం ఉపాధి, ఉద్యోగాలు పొందుతున్నారు.
- అయోధ్యలో నిర్మించిన రామమందిరంలో సైతం వర్సిటీ విద్యార్థులు పనిచేస్తుండడం గర్వంగా ఉంది.

బాబోయ్ పడిపోతున్నాయ్!



పిల్లపాళెం సమీపంలో గుంతమయంగా స్వర్ణముఖి నది (ఇన్‌సెట్) తవ్వకాలు సాగిస్తున్న జేసీబీ

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని స్వర్ణముఖి నదిలో నిత్యం ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయి. కూటమి నేతల కారణంగా ప్రమాదకర పరిస్థితులు దాపురించాయి. నదిలో సుమారు 20 అడుగుల లోతు వరకు ఇసుకను తవ్వేస్తుండడంతో విద్యుత్ స్తంభాలు పడిపోయే దుస్థితికి చేరుకున్నాయి. అధికారులు సైతం చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు అడ్డూఅదుపూ లేకుండా పోయింది. గాలివాన వస్తే స్తంభాలు పడిపోతాయని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు.
– రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్)






పిల్లపాళెం, కుట్రమంగళం, పెనగడం గ్రామాల వద్ద కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభాలు

స్విమ్స్‌లో మెడికల్ మాఫియా

- నిబంధనలకు విరుద్ధంగా సూచిక బోర్డులు
- జన ఔషధ మందులను అడ్డుకుంటున్న వైనం
- మామూళ్ల మత్తులో అధికారులు

తిరుపతి తుడా: టీటీడీ స్విమ్స్ ఆస్పత్రిలో మెడికల్ మాఫియా చెలరేగిపోతోంది. 70 శాతం డిస్కౌంట్‌తో లభించే జనఔషధ మందుల షాపు మూతపడడంతో రోగులపై మరింత భారం పడుతోంది. ఈ మెడికల్ షాప్‌నకు సంబంధించి టెండర్ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ఆ మెడికల్ షాపే దిక్కు

ఇటీవల స్విమ్స్ అత్యవసర విభాగం సమీపంలో మెడికల్ షాపు వెలిసింది. ఈ షాపు దక్కించుకున్న యజమానులకు లాభం చేకూర్చేలా సంబంధిత స్విమ్స్ ఉన్నతాధికారులు సహకరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. అలాగే పాత ఏడీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న మరో మెడికల్ షాపునకు సకాలంలో టెండర్ నిర్వహించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. ప్రస్తుతం అత్యవసర విభాగం వద్ద ఉన్న మందుల దుకాణమే రోగులకు పెద్ద దిక్కుగా మారింది.



సిమ్స్‌లో ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు

తప్పని నిరీక్షణ

సిమ్స్ అత్యవసర విభాగం, అలాగే ఓపీ విభాగానికి రోజుకు వెయ్యి మందికి పైగా రోగులు వస్తుంటారు. ఈ రోగులకు సంబంధించి ఒకటే మెడికల్ షాపు అందుబాటులో ఉండడంతో మందుల కొనుగోలు సమస్యాత్మకంగా మారింది. నిత్యం ఆ మందుల దుకాణం వద్ద రోగులు క్యూ కట్టాల్సి వస్తోంది.

మామూళ్ల మత్తులో అధికారులు!

సదరు మందుల షాపునకు వందలాది మంది క్యూ కడుతున్నారు. రోజుకు రూ.10 లక్షలకు పైగా వ్యాపారం జరుగుతున్నట్టు సమాచారం. పనిలోపనిగా సంబంధిత మెడికల్ షాపు యజమానులు అధికారులకు మామూలు ఇచ్చుకొని సమీపంలో మరో మందుల దుకాణం రానీయకుండా అడ్డుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా సూచిక బోర్డులు

స్విమ్స్ అత్యవసర విభాగం వద్ద నిర్వహిస్తున్న మందుల దుకాణ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా స్విమ్స్‌లో సూచిక బోర్డులు ఏర్పాటు చేసి రోగులను తికమకపెడుతున్నారు. సదరు మందుల దుకాణానికి సంబంధించి 20కి పైగా సూచిక బోర్డులు వెలవడం గమనార్హం.

అన్నీ వారే చూసుకుంటున్నారు

స్విమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో మెడికల్ షాపుల నిర్వహణ, టెండర్ల ప్రక్రియ తదితర విషయాలన్నీ టీటీడీ ఉన్నతాధికారులే చూస్తున్నారు. ఇక్కడ మా ప్రమేయం ఏమీ లేదు.
– స్విమ్స్ అధికారులు